



పారిజాతపు పువ్వుని నేనెప్పుడూ చూడలేదు—
పారిజాతాన్ని మాత్రం బాగా తెలుసు—

పారిజాతం, నేనూ చిన్నప్పటినుంచీ ఒకటిగా కలిసి పెరిగాం.

వెన్నెట్లో వెలిగాం—వర్షంలో తడిశాం.

ఎండల్లో కరిగాం?—చలిలో వణికాం—

• • •

ఆ వర్షపు సాయంకాలం. . . ఆడ మరపుగా గొడుగేసుకు వెళుతుంటే. బస్టాపు దగ్గరగా ఒక స్త్రీ కంఠం వినిపించింది.

'ఇఫ్ యూ డోంట్ మైండ్ కాస్త దూరం లిఫ్ట్ ఇస్తారా' అని—

"విత్ ప్లెజర్" అని గొడుగుని ఆమె వైపు వంచాను.

గొడుగు లోని కొచ్చిందామె. బస్టాపులో ఉన్న వాళ్ళంతా వింతగా చూస్తుంటే గొప్పగా అనిపించ లేదు నాకు. ఒళ్ళు చచ్చినట్లనిపించింది. ఆమె, నేనూ ఏడడుగులేం ఖర్మ. ఏభై అడుగులే నడిచాం. ఏమీ మాట్లాడుకోకుండానే.

కొత్త రోడ్ స్టాప్ వచ్చేసరికి ఆమె ఆగి, 'వెరీ మెనీ థాంక్స్, వస్తానండీ" అందామె వెలుగులో ఆమె ముఖంలోకి చూశాను.

ఎవరో కాదు—ఆమె పారిజాతం—

"పారిజాతం... . . నువ్వా . . ." అన్నాను ఆశ్చర్యంగా.

పారిజాతంకూడా నా వైపు ఆశ్చర్యంగా చూసి గుర్తు పట్టింది.

"నువ్వా త్రిమూర్తీ. ఎక్కడుంటున్నా విప్పుడూ" అడిగింది.

"ఇక్కడే నీ సమక్షం లోనే ఈ గొడుగు కిందే అనాలనిపించింది, కానీ పారిజాతానికి జోకులు పడవు. జీవితం అర్థమైనంతగా ఆమెకు జోకు అర్థం కావు. అందుకే మామూలు ధోరణిలో ఎక్కడుంటు న్నానో చెప్పాను.

"మా వారికీ ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ అయింది. మా ఇంటికి రాకూడదూ ఒకసారి" అంది.

"రావచ్చు. కానీ మీ ఇల్లు తెలియాలిగా" అన్నాను.

పారిజాతం నవ్వింది.

పారిజాతాలు పళ్ళు దానిమ్మ గింజల్లా ఉండవు. మల్లెల్లా ఉంటాయి.

పారిజాతం మాత్రం మల్లెలా ఉండదు. పారిజాతపు పువ్వులాగా ఉండదు. ఎర్ర మందారంలా ఉంటుంది.

"పీర్ల కోనేరు గట్టు కవతల రావి చెట్టుంది... ఆ పక్కనున్న పసుపు పచ్చటి డాబా ఇల్లే మా ఇల్లు. డాబా గోడ మీద పూల కుండీలుంటాయి ఈజీగా కనుక్కోవచ్చు. తప్పకుండా రా" అంది.

"పారిజాతపు మొక్కల్ని నాటావా" అని అడుగుదా మనుకున్నాను.

"మ్యూజికల్ హోమ్‌లో కాస్త పనుంది. వస్తా" అంటూ చెయ్యి ఊపి మళ్ళీ నేను నా దారిన పడ్డాను.

• • •

మీటింగూ పాటూ లేని ఒక ఆదివారం సాయం త్రం "పీర్లకోనేరువక్కనుంచివస్తూంటే పారిజాతం

గుర్తొచ్చింది. వెళదామా వద్దా అని సంశయిస్తూనే వెళ్ళాను.

ఇల్లు కనుక్కోవడం పెద్ద ఇబ్బందేం కాలేదు వెళ్ళేసరికి పారిజాతం ముందు గదిలోనే ఉంది నన్ను చూసి లేచి, "రా, రా మొత్తానికి వచ్చావే. . .' అంది

"రావనుకునే పిలిచావా, అందామనుకుని వూరు కున్నాను.

'కూర్చో' అని కుర్చీ చూపించి ఎదురుగా కూర్చుంది.

టేప్‌రికార్డర్ లోంచి 'బహదూర్‌షా జఫరాలే' గీతం వినిపిస్తూంది.

"ఉమ్రేం దరాజ మాంగ్‌కేలాయేథే చార్‌దిన్... దో. . .ఆర్‌జూమె. . .కట్ గయా. . దో ఇంతిజార్‌మె. . ."

"నువ్వు కాఫీయా టీయా ఏం తీసుకుంటావ్"

"ఇప్పుడెందుకులే పారిజాతం" అన్నాను ఇబ్బందిగా.

"అదేంటి—నీకోసం కాదులేవోయ్ నేనెట్లానూ తాగాలిగా—నేనైతే కాఫీ తాగుతాను మీ వంగ వాళ్ళంతా టీలుతాగి తిరుగుళ్ళు తిరుగుతారు.అయినా అంతే."

"నాకూ కాఫీయే" అని పాటుగా లేచిపోయింది.

పాట పూర్తవకుండానే రెండు కప్పుల్లో కాఫీ తీసుకొచ్చింది. ఇన్‌స్టెంట్ కాఫీ—టేప్ రికార్డర్‌ని ఆపి ఎదురుగా కూర్చుంది.

"చెప్పు—ఏం చేస్తున్నావిప్పుడు. మీ ఆవిడను తీసుకురాలేదేం?"

"ఆవిడా లేదు. అత్తగారూ లేదు"

నా మాటకి భళ్ళున నవ్వింది పారిజాతం.

"ఏం అట్లా అన్నావ్. పుట్టింటి కెళ్ళిందా మీ ఆవిడ. . ." అంది.

"ఆఁ. . . పుట్టింట్లోనే ఉంది పెళ్ళయ్యేవరకూ ఉంటుందికూడా" అన్నాను. పారిజాతం మళ్ళీ నవ్వింది కెరటాల్లా గలగలా

"పెళ్ళికీ ఉద్యోగానికీ ముడి వేశావేమిటి" అంది కాస్సేపాగి.

అవునన్నట్లు తలూపాను.

"అసిలే మంచి పని చేశావ్. రచయితవి కాబట్టి కాస్త ఆలోచించావు. కట్నం కోసం ఉద్యోగం లేక పోయినా ఎంతమంది చేసుకోవటం లేదీ రోజుల్లో" అంది. పారిజాతం.

మాట లేప్పుడూ అంతే. ఆ మాటల్లోంచి ఏదో ఒక జీవిత సత్యాన్ని వెలికి తీయవచ్చు. ఈలోగా వాళ్ళాయన కాబోలు వస్తే లేచింది పారిజాతం నేనూ కాస్త ఇబ్బందిగా కదిలాను.

"నే చెప్పలా—త్రిమూర్తంటే ఇతనే. కథలూ అవీ రాస్తుంటాడు" అని, "మా వారు తెలుగు కథలు చదవరు" అంది.

పారిజాతంకూడా జోకు వెయ్యగలదని మొదటి సారి తెలిసింది. ఏవో రెండు ముక్కలు మాట్లాడి ఆయన లోపలకు వెళ్ళాడు. నేను లేచాను. "వెళ్ళొస్తా పారిజాతం" అంటూ.

"భలే వాడివే—అప్పుడే" అంది కళ్ళు తిప్పుతూ.

'మరో సారొస్తా. ఇల్లు తెలుసుగా' అని బయట పడ్డాను. నిజం చెప్పొద్దూ—పారిజాతం భర్తని చూసి గిల్టీగా ఫీలైయాను. ఇన్‌ఫీరియారిటి కాంప్లెక్స్‌తో బాధ పడ్డానుకూడా. అతను ఉద్యోగస్తుడు. పైగా పారిజాతం వంటి అందాల రాణిని స్వంతం చేసుకున్న వాడూను.

● ● ●

'ఎక్సార్‌సిస్ట్' పిక్చరు చూసి బయటకు వస్తూంటే ఎవరో పిలిచినట్లై తిరిగి చూశాను. పారిజాతం రిక్షా ఎక్కుతూంది. దగ్గర కెళ్ళాను.

"నిన్నే ఎన్ని సార్లు పిలవనూ. అంతా నా వైపే చూస్తున్నారుకూడా" అంది.

"సారీ. వినపళ్ళేదు."

"నువ్వూ సినిమాలు చూస్తావన్నమాట. ఎలా ఉంది" అడిగింది.

చెప్పాను.

"ఇంటికేనా?"

అవునన్నట్లు తల వూపి "ఆయన రాలేదా' అన్నాను.

ఆయనుంటే నాకీ రిక్షా యేం ఖర్మ—కాంపు కెళ్ళారు. తోచక సినిమాలో వచ్చాను. నీ కేం పని లేకపోతే మా ఇంటి దాకా రాకూడదూ" అంది. పనేం లేదు కాని సంశయించాను.

"వెళ్ళిపోదూ గానిలే. రా" అంటూ రిక్షాలో చోటు చూపించింది.

తప్పనిసరిగా ఎక్కాను.



చెట్టు క్రింద...

చిత్రం—ఎమ్. సోమసుందరరావు ([illegible])

పారిజాతం, నేనూ చిన్నప్పుడు ఒకే సైకిలు మీద ప్రయాణం చేశాం. మామిడి కొమ్మ మీద పక్క పక్కనే కూర్చుని ఎన్నో కబుర్లాడుకున్నాం. ఒకే కాయ కాకెంగిలి చేసి కారం అద్దుకు తిన్నాం. కానీ ఇప్పుడు?"

ఏదో బెరుకు. . . భయం. తను పెళ్ళయింది. నేను. . .?

ఇంటి ముందు రిక్షా ఆపించి డబ్బులు తనే ఇచ్చింది పారిజాతం. ముందు గదిలో నన్ను కూర్చో మని టేప్ రికార్డర్ ఆన్ చేసి లోపలి కెళ్ళింది

"నకిసీకీ. ఆంఖ్ కా నూర్ హూ... నకిసీ కొదిల్‌కె కరార్‌హూ. జొకిసికె కామ్ న ఆసకె. . . మై ఓ ఏక్ ముష్త్ గుబార్‌హూ. . ." రఫీ గొంతులో ఘజల్ జీవం పోసుకుంటూంది.

"నీ కివాళేంటి—టిఫినా, భోజనమా?" ఉలిక్కి పడి తలెత్తాను.

స్నానం చేసి బట్టలు మార్చుకుని వచ్చింది పారిజాతం.

"భోజనమే" అన్నాను మామూలుగా.

"ఇక్కడే చేద్దువు కాని. నా క్కాస్త కంపెనీ ఉంటుంది" అంది.

"పిక్చర్ అంత భయమనిపించిం దేమిటి" అన్నాను.

"అది కాదు. నా కొక్కదానికీ ఎప్పుడూ తోచదు. ఇరుగూ పొరుగూ లేని ఇల్లు. ఆయన కాంపు వెళితే నా కీ టేప్‌రికార్డరూ టే పుస్తకాలే లోకం."

భోజనం ముగించి మాటల్లో పడ్డాం. పారిజాతం ఎంతో ఎదిగిపోయినట్లు కనిపించింది నాకు శారీరకంగా, మానసికంగా. సంగీతం గురించి చాలా లోతుగా మాట్లాడింది.

మాటల్లో పడి టైం తెలియలేదు—వాచీ చూస్తే పదకొండున్నర అయింది—బయటకూడా చినుకులు మొదలయ్యాయి.

"నే వెళ్తా, పారిజాతం" అంటూ లేచాను—

"ఎక్కడి కెళ్తావ్—ఈ పూటకి ఉండిపోరాదూ! నాకు కంపెనీగా కూడా ఉంటుంది" అంది—

నేనేం మాట్లాడలేదు—పారిజాతాన్ని చూస్తుంటే ఎంతసేపైనా అలా కూర్చొని ఆమె మాటల్ని వినాలనే ఉంది—కాస్సేపేదో మాట్లాడి "నాకు పడుకుని మాట్లాడుకోవడమంటే ఎంతో ఇష్టం—నువ్వు ఎక్కడ పడుకుంటావో చెప్పు. మా కాట్ కాక మడత మంచముంది. కానీ మడత మంచం మీదికి పరుపు లేదు. నువ్వెక్కడ పడుకున్నా సరే" అంది.

"నాకు పరుపు అలవాట్లేదులే—ఈజీఛెయిర్ చాలు" అన్నాను.

"భలేవాడివే—నీతోపాటూ నన్నూ జాగరణ చేయమనా ఏం నీ ఉద్దేశం" అంటూ మడతమంచం వాల్చి డబుల్‌కాట్‌మీది ఒక దిండును దాని మీద వేసింది.

నేనేం మాట్లాడలేదు. పారిజాతం నన్ను ఎప్పట్లానే చూస్తున్నా నేను మాత్రం ఆమెను మునుపటిలా చూడలేక పోతున్నాను—మధ్య ఏదో అగాధం—కంచె.

మాట్లాడుతూనే నిద్రపోయింది పారిజాతం—పల్లటి అంచున్న పసుపు చీర కట్టుకుని పల్చని బ్లౌజు వేసుకుంది—పారిజాతం వంక. చూస్తుంటే నాలో

ఏవో ఆలోచనలు.,.. ఎప్పటివో అనాటి జ్ఞాపకాలు—ఆవెన్నెల రాత్రులు. . .విరిసీ విరియని పువ్వుల్లాంటి జీవితాలు!

ఇప్పు డా చనువు లేదు—కోరిక. . ఏవేవో కోరికలు—లైటార్పి బెడ్ లాంప్ వెలిగించి పడుకున్నాను—కంటి మీదికి నిద్ర లేదు—ఒకే ఇంట్లో పారిజాతం, నేనూ. . .చుట్టూ సంబంధంలేని ప్రపంచం—బయట వర్షం, లోన వయసు కోరికలు—లేచి కిటికీ దగ్గరకు వెళ్ళాను—రెండో ఆట వదిలి చాలా సేపైనట్టుంది—'ఈ రాత్రప్పుడు పారిజాతం భర్త వస్తే?" అత నేమనుకుంటాడో వూహించలేక పోయాను. మంచం మీద పారిజాతం సంపంగి మొగ్గలా ఉంది—అందమైన పారిజాతం ఈ రోజు మరీ అందంగా ఉంది. ఆమెలోని తెలివి తేటలూ, అభిరుచులూ, పరిసరాలూ మరీ అందంగా చేస్తున్నాయామెను.

కోర్కెలు నా నరాల్ని కాల్చేస్తున్నాయి—ఒళ్ళంతా వేడి సెగలు! నేను తల్చుకుంటే పారిజాతాన్ని ఎప్పుడో పెళ్ళాడేవాడిని—కాని అప్పటి ధ్యేయం వేరు—మరి ఇప్పు డీ పరిస్థితి. . .?

అనుకోకుండా ఆమెపైకి వంగి రెండు చేతుల తోనూ ఆమె ముఖాన్ని దగ్గరకు తీసుకున్నాను—'పారిజాతం పువ్వు ఇలాగే ఉంటుంది కాబోలు ఇంత అందంగా" అనిపించింది. బల్లిపడ్డదానిలా చటుక్కున తుళ్ళిపడి లేచింది పారిజాతం. నన్ను చూసి—" నువ్వా త్రిమూర్తీ—ఏమిటిది?" అంది నా చేతులను సున్నితంగా విడిపించుకుంటూ—

నా గొంతు వణికింది తప్ప నోట మాట రాలేదు—

"ఏమిటీ. నిద్రపోలేదూ— నీ కళ్ళిలా కాలి పోతూందేం? ఒంట్లో బాగా లేదా?" అంది అతి మామూలుగా.

నా కళ్ళలో కోర్కె విజృంభిస్తూంది—

"పారిజాతం. . ." అన్నాను వణికే కంటంతో. నా అవస్థను గుర్తించింది పారిజాతం.

"అవకాశం మనిషిని దిగజార్చకూడదు త్రిమూర్తీ నువ్వూ అందర్లాంటి వాడివే అయితే మన స్నేహానికి నేనింత విలువ నిచ్చేదాన్ని కాదు—నిజం! చెప్పాలంటే నా జీవితంలో నీకెంతో స్థానం ఉంది—నా జ్ఞాపకాల్లో సగభాగం నీవే—ఆ స్నేహం, ఆ ఆప్యాయతా ఏమయ్యాయి త్రిమూర్తీ? ఏ పరిస్థితుల్లో చేసినా తప్పు తప్పే—అది జీవితాంతం మనల్ని వెన్నంటుతూనే ఉన్నుంది—జీవితానికి మచ్చను తెస్తుంది. రచయితగా ఎదిగినవాడివీ.... జీవిత సత్యాల్ని వడబోసిన వాడివీ... నీకు నేను చెప్పేదేముంది?"

సున్నితంగానే మందలించింది పారిజాతం—ఆ మందలింపులో ఎంత ఆపాగయత ? ఎంత పెద్దరికం?'

మరి కాస్సేపట్లోనే ఏమీ జరగని దానిలా నిశ్చింతగా నిద్రపోయింది పారిజాతం.

కోరికలు చెల్లాచెదరై ఆదమరిచి నిద్రపోయాను.

*


ప్రతి హృదయంలో ప్రతి సదనంలో సాహితీ జ్యోతులు వెలిగించే డీలక్స్ ప్రచురణలు

**కావిలిపాటి విజయలక్ష్మి**
అగ్నిహారం ............ 8.00
జీవన సంధ్య ........ 6.00
చాకులాంటిపిల్ల ...... 7.50

**బొమ్మా హేమాదేవి**
నవరసాలు ........ 7.50
లవ్ స్టోరీ .......... 6.00

**పోల్కంపల్లి శాంతాదేవి**
స్వప్నసౌధం .............. 6.00

**నందుల సుశీలాదేవి**
చిగురాకులు ............ 6.00
శ్రావణమేఘాలు ........ 6.00

**రాచకొండ శ్రీదేవి**
నందిని ...................... 10.00

**మల్లాది వెంకటకృష్ణమూర్తి**
పడమటి సంధ్యారాగం ...... 8.00
పారిపోయిన ఖైదీలు ...... 6.00

డీలక్స్ పబ్లికేషన్స్
ఏలూరురోడ్,
విజయవాడ-2